క్లుప్తంగా

రేపు ఆలయ భూముల కౌలు వేలం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి వీరభద్ర స్వామి ఆలయ భూముల కౌలు బహిరంగ వేలం ఈనెల 14వ తేదీన ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ మద్దు వెంకట రామలింగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబర్ 199/2లో 2.15 ఎకరాలకు ధరావతు రూ.6 వేలు, మరో చోట 199/2లో 2.15 ఎకరాలకు రూ.6 వేలు, 199/2లో 3 ఎకరాలకు రూ.9 వేలు, 195/2లో 1.80 ఎకరాలకు రూ.6 వేలు, 195/2లో 0.85 సెంట్లకు రూ.3 వేలు, 195/2లో 2.20 ఎకరాలు రూ.6 వేలు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు.

ఈఏపీ సెట్ ర్యాంకర్లకు అభినందన



తిరువూరు: స్థానిక శ్రీనిధి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివి, ఏపీ ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఈఏపీ సెట్ ర్యాంకర్లు షేక్ సానియా, ఆకుల అనూష, ముత్యాల యశస్విని, కోలా కేశవ్, టేకు రాము, కొప్పెర భవ్యశ్రీ, మనుబోతుల బాలాజీ, జానూతల ఫణీంద్రకుమార్‌లను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ వేగి శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

పాలసంఘం అధ్యక్షుడు భాస్కరరావుకు నివాళి



రెడ్డిగూడెం: మండలంలోని శ్రీరామపురం పాల సంఘం అధ్యక్షుడు నాదెళ్ల భాస్కరరావు గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, బత్తుల వెంకటేశ్వరరెడ్డి, ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, తోటకూర రవిబాబు, నూనె అప్పిరెడ్డి, బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, చిలుకూరు రామిరెడ్డి, పాలంకి సురేష్‌రెడ్డి పాలంకి రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన సుధాకరరావు

తిరువూరు: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి బత్తుల సుధాకరరావు ఎంతగానో కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుడు బత్తుల సుధాకరరావు వర్ధంతి కార్యక్రమం బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పలువురు కార్మిక సంఘ నాయకులు సుధాకరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నేతగా ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి సుధాకరరావు చేసిన కృషిని నాయకులు కొనియాడారు. ప్రజా సంఘాల నాయకులు నూకల సత్యనారాయణ, మేకల నాగేంద్రప్రసాద్, సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కుండోడి చెరువులో పూడిక తీత పనులు



పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కుందావారి కండ్రిక కుండోడి చెరువులో ఉపాధి పనులు గత కొన్ని రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. బుధవారం విలేజి కండ్రికకు చెందిన ఉపాధి కూలీలు పూడికతీత పనులు నిర్వహించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 64వ డివిజన్ విలేజి కండ్రిక, పాతపాడు గ్రామాల వ్యవసాయ పొలాలకు సాగు నీరు సరఫరా అవుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఉపాధి పథకం కింద చెరువులో పూడిక పనులు నిర్వహిస్తున్నట్లు మండల ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు తెలిపారు. 55 మంది ఉపాధి కూలీలతో పూడికతీత పనులు చేయిస్తున్నామని ఆయన తెలిపారు. 15 మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పు, అడుగు లోతు పూడిక తీస్తే కూలీకి రోజుకు రూ. 300 వేతనం చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. చెరువు ఆయకట్టు పరిధిలో ఉన్న సాగు భూములకు సాగునీరు అందించేందుకు పూడిక తీత అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

పురాతన ఆలయాలకు నూతన శోభ



తిరువూరులో పునర్నిర్మాణం జరుగుతున్న దాసాంజనేయ స్వామి ఆలయం



తిరువూరులో దాతల సహకారంతో నిర్మించిన కోదండ రామాలయం

- ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం
- ప్రభుత్వ దేవస్థానాలకూ మోక్షం
- తిరువూరు ఆలయాలకు మహర్దశ

తిరువూరు: తిరువూరు పట్టణంలో వందల ఏళ్ల కిందట నిర్మించిన దేవాలయాలకు దాతల సహకారంతో జీర్ణోద్ధరణ ప్రక్రియ జరుగుతోంది. పురాతన కాలంలో నిర్మించి, శిథిలావస్థకు చేరిన పలు ఆలయాలను పునర్నిర్మించేందుకు అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసి విరాళాలు సేకరిస్తున్నారు. ఏడాది కిందట మునుకుళ్ల రోడ్డులోని రాజ్యలక్ష్మి సమేత రంగనాయకస్వామి ఆలయాన్ని, కోదండ రామాలయాన్ని పునర్నిర్మించగా, శాస్త్రోక్తంగా వాటిలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. ప్రస్తుతం జగన్నాథపురంలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ జరుగుతోంది. మూడు నెలల కిందట పాత ఆలయాన్ని తొలగించి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులను చేపట్టారు. పట్టణ ప్రముఖులు కొల్లిపర సుబ్బారావు, గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు, గోపాల్, చిన అంజయ్య, ఆంజనేయులు తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఆలయాలకు నూతన శోభ

పునర్నిర్మాణం జరిగిన ఆలయాల్లో భక్తులు పూజలు, పర్వదినాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో నూతన శోభ సంతరించుకుంది. ప్రైవేటు ధర్మకర్తల పర్యవేక్షణలో కోదండ రామాలయం, రంగనాయకస్వామి ఆలయాలను నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న బస్టాండు సెంటర్‌లోని రామలింగేశ్వరాలయాన్ని కూడా త్వరలో పునర్నిర్మించేందుకు ఆ శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారి కంటే లోతట్టులో ఉన్న ఈ ఆలయంలో వర్షాకాలంలో నీరు చేరి భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతుండటంతో పునర్నిర్మించాలని నిర్ణయించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

న్యాయమూర్తి వి. వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వి. వెంకటేశ్వరరావు



అడవినెక్కలంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ వేము రాజు తదితరులు

నూజివీడు: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని నూజివీడు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు అన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్‌లో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా నేరమని, దీనిపై యజమానులకు జరిమానా విధించవచ్చని చెప్పారు. పిల్లలను పనికి కాకుండా బడికి పంపాలనే ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. నూజివీడు అసిస్టెంట్ లేబర్ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఎక్కడైనా 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను పనిలో పెట్టుకుంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. పనిచేస్తున్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, న్యాయవాది చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి..

ఆగిరిపల్లి: బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడవి నెక్కలం సర్పంచ్ వేము రాజు అన్నారు. బుధవారం మండలంలోని పోతవరప్పాడు, కనసానపల్లి, వడ్లమాను, ఎస్‌ఏ పేట, రాజవరం, అడవినెక్కలంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేము రాజు మాట్లాడుతూ బాలలు పనిలో కాకుండా బడిలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ దివ్య, క్లస్టర్ కో-ఆర్డినేటర్ శివ దుర్గ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తిరువూరురూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గానుగపాడులో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పలు సౌకర్యాలను వివరించారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, తల్లి ఖాతాలో నగదు జమ, మధ్యాహ్న భోజన పథకం తదితర సదుపాయాలను తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. చిట్టేల ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో ప్రవేశం కల్పించారు. చదువుకునే వయసులో పిల్లలను పనులకు పంపవద్దని, బాల కార్మికులను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, కొండలరావు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించాలి

ఏఓ రాజ్యలక్ష్మి

విస్సన్నపేట: పంట పొలాల్లో భూసార పరీక్షలు, మట్టి నమూనా పరీక్షలు చేయించాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులకు మట్టి నమూనాల సేకరణపై బుధవారం సమావేశం నిర్వహించారు. రైతుల పంట పొలాల్లో భూసార పరీక్షలు, మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాల్సిన వారు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయదుర్గా ఆలయ బ్రహ్మోత్సవాలు



విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయం



విశేష పూజలందుకున్న అర్ధనారీశ్వర స్వామి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజున ఆలయ విమాన గోపుర సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాలను అవ్వారి ఉమా శంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలతో పాటు వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దగా, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. 14వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపన, ప్రధాన దేవతామూర్తి అనుష్ఠానం, పారాయణ, హోమాలు నిర్వహిస్తారు.
10 గంటలకు శాంతి కల్యాణోత్సవం, సాయంత్రం శారదా నృత్య పీఠంచే నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు. 15వ తేదీ ప్రధాన దేవతామూర్తి అనుష్ఠానం, పారాయణ, హోమాలు, విమాన గోపురం దేవతా మూర్తుల సంప్రోక్షణ, శాంతి కల్యాణం చేస్తారు. 16వ తేదీ ఉదయం శాంతి కల్యాణం, మహా పూర్ణాహుతి, వేద పండితుల ఆశీర్వచనం జరుగుతుంది. సాయంత్రం ప్రధాన దేవతా మూర్తులచే నగరోత్సవం నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు.

అడుగంటిన చెరువులు



అడుగంటిన నీటితో గౌరవరం చెరువు

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలంలో తాగు, సాగునీరు చెరువులు అడుగంటాయి. నీటినిల్వలు పూర్తిగా తగ్గిపోవడంతో చెరువులు కాస్తా ఒట్టిపోయాయి. ఎండాకాలం కావడంతోపాటు సాగర్ కాల్వలకు కూడా సాగర్ నీరు అందించకపోవడంతో చెరువుల్లో నీటి పరిమాణం తగ్గిపోయింది. చెరువుల్లో తగినంత నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు సైతం అడుగంటాయి. జగ్గయ్యపేట మండలంలో గౌరవరం, మల్కాపురం, షేర్‌మహ్మద్‌పేట, అనుమంచుపల్లి, గండ్రాయి, పోచంపల్లి, చిల్లకల్లు గ్రామాల్లోని చెరువుల్లో నీరు బాగా తగ్గిపోయాయి. రానున్న రోజుల్లో పశువులకు సైతం నీరు దొరకని పరిస్థితి నెలకొంది. గౌరవరం, అనుమంచుపల్లి, గండ్రాయి చెరువుల్లో నీరు పూర్తిగా తగ్గిపోవడంతో ఆయా గ్రామాలకు అరకొరగానే తాగునీరు అందుతోంది. సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో నియోజకవర్గంలో నందిగామ డీవీఆర్ బ్రాంచ్ కెనాల్ కాల్వ కూడా ఎండిపోయింది. కాల్వలకు ఇప్పటివరకు సాగు నీరు రాకపోవడంతో ఈసారి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగు మరింత ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు.



అరకొర నీటితో ఉన్న గండ్రాయి చెరువు



సాగర్ నీరు విడుదల కాకపోవడంతో ఎండిపోయిన డీవీఆర్ బ్రాంచి కాలువ

నెడ్‌క్యాప్ చైర్మన్ 'వేల్పుల' రాజీనామా



పెనుగంచిప్రోలు: నెడ్‌క్యాప్ చైర్మన్ పదవికి పెనుగంచిప్రోలుకు చెందిన వేల్పుల రవికుమార్ బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో తన రాజీనామా పత్రాన్ని ఎనర్జీ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపించామన్నారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో పాటు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల ఇళ్లపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతుండటం సరికాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము బతికున్నంత కాలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పాలి

ఎంఈఓ శ్యామ్ సుందరరావు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్యామ్‌సుందరరావు

గంపలగూడెం: పాఠశాలల ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులను ఆకర్షించేలా ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పి విద్యార్థులకు స్వాగతం పలకాలని గంపలగూడెం ఎంఈఓ-1 శ్యామ్‌సుందరావు అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా స్థానిక ఎంఆర్‌సీలో బుధవారం మండల పరిధిలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో తగిన వాతావరణంలో బోధన జరిగేలా ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలన్నారు. మండలంలో ఉపాధ్యాయులు లేని ఎనిమిది పాఠశాలల్లో తాత్కాలికంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే పుస్తకాలను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పూర్తి స్థాయి కిట్లను పాఠశాలలకు నేరుగా సరఫరా చేస్తామని చెప్పారు. ఆలస్యం లేకుండా వాటిని విద్యార్థులకు వెంటనే అందజేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనం సరఫరా అయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఎంఈఓ-2 పీవీడీఎల్ నరసింహారావు, ఆయా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



రాజేష్‌బాబును సత్కరించిన స్పెషల్ మేజిస్ట్రేట్ కృష్ణమూర్తి, డీఎస్పీ లక్ష్మయ్య

నూజివీడు: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ప్రజలకు ఉత్తమ సేవలు అందుతాయని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి విజయవాడకు బదిలీ అయిన చీకటి రాజేష్‌బాబుకు బుధవారం స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించినప్పుడే సమాజంలో మంచి పేరు వస్తుందన్నారు. మరో ముఖ్య అతిథి నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని, సమయ పాలన పాటించాలని, సమయాన్ని వృథా చేస్తూ కాలం గడపకూడదన్నారు. రాజేష్‌బాబును స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, డీఎస్పీ గోలి లక్ష్మయ్య ఘనంగా సత్కరించారు. ఏఎస్‌ఐలు ప్రసాద్, సంపత్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి నారాయణరెడ్డి సేవలు ఎనలేనివి



నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

పెనుగొలను(గంపలగూడెం): రచయిత సింగిరెడ్డి నారాయణరెడ్డి తెలుగు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన గొప్పకవి అని పలువురు వక్తలు కొనియాడారు. షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో పెనుగొలనులో బుధవారం నారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదూరి వెంకట నరసింహారావు, షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి నారాయణరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఎన్నో పద్య, గేయ, ముక్తక కావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్ర కథనాలు, సంగీత నృత్య రూపకాలు, బుర్ర కథలు, గజళ్లు, వ్యాసాలు, నాటకాలు, విమర్శనా గ్రంథాలు రాశారని వివరించారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ తోట నాగరాజు, కమిటీ సభ్యులు వూటుకూరు యజ్ఞకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ కేఎస్ రామరావు స్వామి వారికి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించి తరించారు. అనంతరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించినా, పాల్గొన్న భక్తుల ఇంట ఇబ్బందులు తొలగిపోతాయని, వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన యోగం కలుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

కృష్ణా జలాల ప్లాంట్ పరిశీలన



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసరావు, శివాజీ, మెటికల శ్రీను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పేటలోని హెడ్ వాటర్ వర్క్స్, ముక్త్యాల లోని కృష్ణా జలాల ప్లాంట్‌ను సీపీఐ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న సుమారు 20 వేల గృహాలకు పాలేరు, కృష్ణా నదుల నుంచి హెడ్ వాటర్ వర్క్స్ ద్వారా నీరు సరఫరా అవుతుందన్నారు. ఈ వేసవి కాలం నుంచి పైపులైన్ల మరమ్మతులు, విద్యుత్ కోతలు, జనరేటర్‌కు డీజిల్ లేక పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులను నింపకపోవడంతో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. నీటి సరఫరా సమస్య ఇంకా ఎక్కడెక్కడ ఉన్నదో తెలుసుకునేందుకు సీపీఐ బృందం హెడ్ వాటర్ వర్క్స్, ముక్త్యాలలోని కృష్ణా జలాల ప్లాంట్‌ను పరిశీలించిందని వివరించారు. గతంలో రెండు పూటల నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఒక్కపూటే నీరు సరఫరా చేస్తున్నారన్నారు. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు స్పందించి రెండు పూటలా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ నాయకులు మెటికల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వర మాంత్రికుడు ఇళయరాజా



విజయవాడ కల్చరల్: స్వర మాంత్రికుడు ఇళయరాజా అని డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. హ్యాపీ మూమెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై బుధవారం హ్యాపీ మూమెంట్స్ అధినేత నేరెళ్ల సురేష్‌కుమార్ సంస్మరణ సందర్భంగా ఇళయరాజా సినీ గీతాల కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ ఇళయరాజా అనేక భారతీయ భాషల్లో వచ్చిన సినిమాలకు సంగీతం అందించారన్నారు. పరచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, సాంస్కృతిక రంగ ప్రముఖులు కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు తదితరులు మాట్లాడారు. చరణ్, అనిల్, రమ్య, జ్యోతి ఇళయరాజా సంగీత దర్శకత్వం వహించిన పాటలను ఆలపించారు.

- మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం ఏలూరు రోడ్డులో అన్నదానం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్, సభ్యులు పందిరి విజయ్ మోహన్ మాట్లాడుతూ తాము ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నామన్నారు. తమకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.